# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 150 క్రిష్ణా, మంగళవారం 24- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# తిరుమల లడ్డూ వివాదం..



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వేదికగా రేపు తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంపై అత్యంత కీలకమైన చర్చ జరగనుంది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ చర్చ మధ్యాహ్నం 2 గంటల వరకు సుదీర్ఘంగా కొనసాగే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో, ప్రభుత్వం ఈ చర్చను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను, నెయ్యి నాణ్యత విషయంలో జరిగిన ఉల్లంఘనలను ఈ సందర్భంగా సభ ముందు ఉంచాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

ఈ కీలక చర్చలో కూటమికి చెందిన పది మంది ఎమ్మెల్యేలు పాల్గొని తమ గళాన్ని వినిపించనున్నారు. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీపై వచ్చిన ల్యాబ్ రిపోర్టులు, టీటీడీలో జరిగిన అక్రమాలపై వారు ఆధారాలతో సహా మాట్లాడే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై సుదీర్ఘ ప్రసంగం చేయనున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, తిరుమల పవిత్రతను కాపాడేందుకు సీఎం రేపు సభలో ఏదైనా సంచలన ప్రకటన లేదా కీలక నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

మరోవైపు, గత కొద్ది రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాత్రపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వల్ప అస్వస్థత కారణంగా ఆయన ఈరోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేకపోయారు. అయితే, తిరుమల లడ్డూ వంటి సున్నితమైన అంశంపై చర్చ జరగనున్న నేపథ్యంలో, రేపు ఆయన సభకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. సనాతన ధర్మ పరిరక్షణ గురించి పవన్ కళ్యాణ్ ఇప్పటికే గట్టిగా మాట్లాడుతున్న తరుణంలో, రేపటి చర్చలో ఆయన ప్రసంగం హైలైట్‌గా నిలుస్తుందని భావిస్తున్నారు. మొత్తానికి రేపటి అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కానున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లపై తీసుకున్న చర్యలు, విచారణ కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. భక్తుల నమ్మకాన్ని పునరుద్ధరించేలా ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణను ప్రకటిస్తుందోనని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల మధ్య సాగే ఈ చర్చ ద్వారా తిరుమల ప్రసాదం పవిత్రతపై నెలకొన్న నీలినీడలు తొలగిపోతాయని సామాన్య భక్తులు ఆశిస్తున్నారు.



## ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: హోం మంత్రి

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23: అమరావతి, జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు.


# స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో తలసరి ఆదాయం భారీగా పెంపు:

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23: అమరావతి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఇవాళ(సోమవారం) సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు.

సాంకేతికత సాయం తీసుకున్నాం..

నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు.

పీ4 ద్వారా ఆర్థిక అసమానతల తొలగింపు..



పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఆ ఘనత ఎన్డీఏదే.. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించింది' అని సీఎం చెప్పారు.

## ఉగాదికి జాబ్ క్యాలెండర్.. జాబితాలోనే డీఎస్సీ పోస్టులు!



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 23: ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు.జాబ్ క్యాలెండర్, డీఎస్సీపై ప్రకటనరాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. విశేషమేమిటంటే, ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

కేజీబీవీ పాఠశాలలపై చర్చ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(ఖ+దీఎ) పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్(మీూ) అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు.దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.పాలిటెక్నిక్, ఐటీఐ విద్య బలోపేతంఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# ఏక సభ్య కమిటీపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం




క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది.

# నిరుపేద వృద్ధురాలి అంతిమ సంస్కారానికి ఆర్థిక సహాయం



**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** నిరుపేద వృద్ధురాలి అంతిమ సంస్కారానికి ఆర్థిక సహాయం అందించిన ఆదిత్య చౌదరి తనకంటూ ఎవ్వరులేని నిరుపేద వృద్ధురాలైన  గతంనుండి మతం తీసుకుని ప్రభువు సేవలో ఉంటూన్న ఈదర సుందరమ్మ కొన్ని నెలలుగా అనారోగ్యంతో భాధపడుతూ ఈరోజున మరణించిన వార్త తెలిసి తెలుగుదేశం పార్టీ ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుల్ల శోభనాద్రి చౌదరి తనయుడు ఆదిత్య చౌదరి 10,000రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఆదిత్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే ఫింక్షన్ ద్వారా జీవించి,ఆత్మాభిమానంతో గౌరవము జీవితం గడిపినదని,ఏసుప్రభు మతంతీసుకొని ప్రభువుసేవ చేసుకొంటూ పాస్టర్ వద్దనే ఉంటూన్నారని ఈ రోజు మరణించినదన్న వార్త తెలిసి  పాస్టర్ తో మాట్లాడి వారి ద్వారా అంతిమ సంస్కారం నిర్వహించాలని కోరి ఈదర సుందరమ్మ పార్ధివ దేహానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు గన్నమనేని శివ,రామకృష్ణ,పాస్టర్,లింగం శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు

# పడిపోయిన ఫ్లాట్ల అమ్మకాలు

**2024తో పోల్చితే 2025లో నగరంలో 34 శాతం మేర క్షీణత**

**ఓ సంస్థ సర్వేలో వెల్లడి**

**ధరలు అధికంగా ఉండడమే కారణం?**

**సిటీలో చదరపు అడుగు రూ.8 వేలుపైనే...**

**శివర్లలో రూ.5 వేలు**

**ఐటీ కంపెనీల రాకతో డిమాండ్ పెరుగుతుందని నిర్మాణదారుల ఆశాభావం**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23:** విశాఖపట్నం-ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇటీవల ఇళ్ల అమ్మకాలు బాగా పడిపోయాయని ఓ సర్వేలో తేలింది. రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రాప్‌ఈక్విటీ అనే సంస్థ ఇటీవల ఒక నివేదికను వెల్లడించింది. దాని ప్రకారం 2024 కంటే 2025లో ఫ్లాట్ల (యూనిట్ల) అమ్మకాలు తగ్గిపోయాయని పేర్కొంది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 25 శాతం తగ్గిపోగా, సూరత్‌లో 15 శాతం, నాగపూర్‌లో 18 శాతం, కొచ్చిలో 17 శాతం పడిపోయాయి. అదే విశాఖపట్నం దగ్గరకు వచ్చేసరికి అత్యధికంగా 34 శాతం అమ్మకాలు పడిపోయాయని పేర్కొంది.

కారణాలు అనేకం

విశాఖపట్నంలో ఫ్లాట్ల విక్రయాలు తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని భవన నిర్మాణ వర్గాలు చెబుతున్నాయి. సిటీలో భూముల ధరలు బాగా పెరిగిపోయాయి. కనీస ధర చ.గజం రూ.లక్ష, అదే ప్రధాన ప్రాంతాల్లో అయితే రూ.1.5 లక్షలు ఉంది. ఇక నిర్మాణ ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వర్కర్ల వేతనాలు కూడా అధికంగా ఉన్నాయి. చ.అ. నిర్మాణానికి కనీసం రూ.2 వేలు పడుతోందని, అదే లగ్జరీ నిర్మాణం అయితే రూ.4 వేల వరకూ అవుతోందని నిర్మాణదారులు చెబుతున్నారు. భూమి ధర, నిర్మాణ వ్యయం, వడ్డీలు, లాభం అన్నీ కలుపుకొంటే సిటీలో చ.అ. కనీసం రూ.8 వేలకు అమ్మితే తప్ప గిట్టుబాటు కావడం లేదని క్రెడాయ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. సిటీలో మధ్య తరగతి ప్రజలు డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనాలంటే వేయి చ.అ. విస్తీర్ణానికి అన్నీ కలుపుకొని కోటి రూపాయల వరకూ వెచ్చించాల్సి వస్తోంది. ఉద్యోగ వర్గాలు ఎవరూ అంత పెద్ద మొత్తం పెట్టే స్థితిలో లేరు. బ్యాంకు రుణం కూడా అందులో సగమే లభిస్తోంది. అందుకని బిల్డర్లు సిటీలో ఎగువ మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని త్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తున్నారని, వాటి విక్రయాలు నెమ్మదించాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. నగర శివారు ప్రాంతమైన మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాదిల్లో సైతం చ.అ. 5 వేలకు విక్రయిస్తున్నారు. అక్కడ రూ.50 లక్షలకు డబుల్ బెడ్‌రూమ్, రూ.70 లక్షలకు త్రిబుల్ బెడ్‌రూమ్ దొరుకుతున్నాయి. అయితే అంత దూరం రోజూ ట్రాఫిక్‌లో తిరగలేక చాలామంది అటువైపు మొగ్గు చూపడం లేదు. తప్పనిసరిగా ఏదో ఒకటి ఇప్పుడే సమకూర్చుకోవాలని ఆలోచన ఉన్నవారు తప్ప, ఇతరులు వాటిపై పెట్టుబడులు పెట్టడం లేదు. అందుకే అమ్మకాలు తగ్గాయని నరెడ్కో ప్రతినిధి మరొకరు వివరించారు. చాలా ప్రాజెక్టులు పూర్తిచేయడం లేదని, డిమాండ్ వచ్చాక చూద్దామని ఆపేశారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇప్పుడు స్పీడ్ పెరుగుతుంది అయితే ఇటీవల గూగుల్, కాగ్నిజెంట్ వంటి సంస్థలతో పాటు టీసీఎస్‌తో పాటు మరిన్ని విశాఖపట్నం వచ్చినందున ఐటీలో ఉన్నవారు ఎంక్వయిరీలు చేస్తున్నారని, త్వరలో డిమాండ్ పెరుగుతుందని ఆశిస్తున్నామని అప్రెడా ప్రతినిధి ఒకరు ఆశాభావం వ్యక్తంచేశారు.

# జిల్లా మారిన ముదినేపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలన్న బి.జే.పీ.నాయకులు






**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::**జిల్లా మారిన ముదినేపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలన్న బి.జే.పీ.నాయకులు ...ఏలూరు 2 ముదినేపల్లి బస్సులు వెయ్యాలని కలెక్టర్ వినతిపత్రంద్వారా కోరిన బి.జే.పీ.నాయకులు....

మండల ప్రజల ప్రయాణ సౌకర్యార్థం ముదినేపల్లి--ఏలూరు నేరుగా బస్సు సర్వీసు కోసం వినతిపత్రం అందించిన బి.జే.పీ.నాయకులు....

కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు, ముదినేపల్లి మండలం నుండి ఏలూరుకు నేరుగా బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలంటూ జిల్లా రవాణా అధికారిని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ తో కలిసి వినతిపత్రం ఇచ్చిన కోటప్రోలు కృష్ణ

2024 సంవత్సరంలో అప్పటి రీజినల్ మేనేజర్ ముదినేపల్లి నుండి ఏలూరు వరకు బస్సు సర్వీసు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలు కాలేదని ప్రజా అవసరాలుపై స్పందించాలని,ముదినేపల్లి మండల ప్రజలు ఏలూరు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా అధికారులను కలవడం, జిల్లా ఆసుపత్రికి వెళ్లడం,అర్.టీ.ఓ. మరియు అర్.డీ.ఓ. కార్యాలయాలకు సంబంధిత పనుల నిమిత్తం ప్రయాణించడం కష్టసాధ్యంగా మారిందని వివరించారు, ప్రజల సౌకర్యార్థం ముదినేపల్లి--ఏలూరు మధ్య నేరుగా బస్సు సర్వీసు ప్రారంభించాలని జిల్లా రవాణా అధికారిని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# భారత్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు వెళితే ఆ మ్యాచ్ తప్పక చూస్తానన్న లోకేశ్

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23:** టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరితే ఆ మ్యాచ్ చూసేందుకు తాను తప్పనిసరిగా వెళ్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అవసరమైతే పులివెందుల ఎమ్మెల్యే కూడా తన డబ్బులతో టికెట్ కొనిస్తానని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్ వీక్షించడంపై జగన్ చేసిన విమర్శలకు లోకేశ్ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.క్రికెట్ మ్యాచ్ చూడటానికి స్టేడియంకు వెళ్లాలా అని జగన్ అంటున్నారు. టీమిండియా ఫైనల్‌కు వెళితే కచ్చితంగా వెళ్తాను. ఆయనకూ  ఓ టికెట్ తీసుకుంటా అని లోకేశ్ అన్నారు. తాను గతంలో సొంత డబ్బులతోనే మ్యాచ్ చూశానని మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, జగన్‌పై లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌కు చెందిన సాక్షి మీడియా, భారతి సిమెంట్స్ సంస్థలకు రూ.1000 కోట్ల మేర అడ్డగోలుగా లబ్ధి చేకూర్చారని లోకేశ్ ఆరోపించారు. తమ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రయోజనం కలగలేదని తేల్చిచెప్పారు. హెరిటేజ్ నెయ్యిపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ కిలో నెయ్యి మార్కెట్‌లో రూ.1,000కి పైగా ఉంటే, రూ.360కి ఎక్కడైనా దొరికితే అది కల్తీదేనని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారని మండిపడ్డారు.బడ్జెట్‌పై చర్చ జరగాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. నిజంగా చర్చపై చిత్తశుద్ధి ఉంటే, నాలుగు రోజుల పాటు సభా కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు.



# ముందుకు సాగరే!

**లక్ష్యాన్ని నిర్దేశించినా అదే నిర్లక్ష్యం**

**45 పంచాయతీల్లోనే నూరుశాతం**

**రూ.46.09కోట్లకు వసూలైంది రూ.19.25 కోట్లు మాత్రమే**

**ఈనెలాఖరు వరకు మరోసారి గడువు**

**ఈ లోపు పూర్తిచేసేనా?**

**ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కాని తీరు**



**క్రైం కౌంటర్ న్యూస్,** ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23  ఇంటి పన్నుల వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగు తూనే ఉంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినా పంచాయతీ ఉద్యోగులు అవేమీ తమకు కాదన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 729 పంచాయతీల్లో రూ.46.09 కోట్లు ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా గత గురువారం ఉదయానికి రూ.19.25 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ.26.84 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 42.01 శాతం మాత్రమే వసూలు చేశారు. జిల్లాలో కేవలం 45 గ్రామపంచాయతీల్లోనే నూరుశాతం పన్నులు రాబట్టారు. మిగిలిన గ్రామ పంచాయతీల్లోని ఉద్యోగులు, సిబ్బందిలో పూర్తిస్థా యి నిర్లక్ష్యం, నిర్లిప్తత కొనసాగుతుందన్న ఆరోప ణలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారం లోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులతోపాటు రాష్ట్రప్రభుత్వం ద్వారా వివిధ రూపాల్లో వచ్చే నిధులను ఇస్తోంది. అలాగే ఆయా గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, వివిధ రూపాల్లో వచ్చే ఆదాయవనరులను సమకూర్చుకొని పల్లెల్లో మౌలిక సదుపాయాలతోపాటు పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు చేసుకునేలా దిశానిర్దేశం చేసింది. అందుకు అనుగుణంగా గత ఐదారు నెలల నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. సంక్రాంతి నాటికి పూర్తిస్థాయిలో ఇంటి పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించినా క్షేత్రస్థాయిలో కదలని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇంటి పన్నుల వసూళ్లతోపాటు పలు అంశాలపై దిశానిర్దేశం చేయడమే కాకుండా నూరుశాతం పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను కూడా సత్కరించారు. ఈనెలాఖరులోపు నాటికి నూరుశాతం పూర్తిచేయాలని మరోసారి లక్ష్యాన్ని నిర్దేశించారు.

స్పందన అంతంతే..

పంచాయతీరాజ్‌శాఖ ఇచ్చిన గడువు సమీపిస్తున్నా ఇప్పటివరకు కనీసం ఉమ్మడి జిల్లా స్థాయిలో 50శాతం పన్నులు కూడా వసూలు కాని పరిస్థితి ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి పదిహేను మంది వరకు 80శాతానికిపైగా వసూలు చేయగా మరికొన్ని పంచాయతీల్లో అయితే కేవలం 10 నుంచి, 20శాతంలోపు మాత్రమే ఇంటిపన్నులు వసూలు చేశారు. మరోవైపు వారం క్రితం కలెక్టర్ రాజాబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సమయంలో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను నిర్దేశించి అప్రమత్తం చేశారు. అయినా క్షేత్రస్థాయిలో పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

హెచ్చరిస్తున్నా స్పందన లేదు ఇంకోవైపు డీపీవో వెంకటేశ్వరరావు ప్రతిరోజూ ఇంటి పన్నుల వసూళ్లపై డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంతోపాటు పంచాయతీరాజ్ శాఖ నుంచి వచ్చిన ఉత్తర, ప్రత్యుత్తరాలను చూపి దిశానిర్దేశం చేస్తున్నా ఆశించిన స్థాయిలో స్పందన లేదు. మండల స్థాయిలో ఉండే డిప్యూటీ ఎంపీడీవోలు ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడిన పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే అలాంటి వారిపై వేటుపడినా మిగతా వారిలో కదలిక లేదు. జిల్లా అధికారులు వెళ్లిన సమయంలోనే వారు కూడా వచ్చి ఆయా గ్రామాలను సందర్శిస్తున్నారే తప్ప రోజువారీ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసి నూరుశాతం పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

# కల్తీ పాల ఘటన..

## అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ కీలక ప్రకటన



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23:** రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సోమవారం అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ కీలక ప్రకటన చేశారు. ప్రాథమిక పరీక్షల్లో యూరియా, సీరం క్రియేటిన్ స్థాయిలు పెరిగాయన్నారు. వరలక్ష్మి మిల్క్ డైరీ నుంచి పాల సరఫరాను నిలిపి వేశామన్నారు. మరణించిన వాళ్ళు 58 ఏళ్ల పైబడ్డ పెద్దవాళు ్లగా గుర్తించామన్నారు. ఇద్దరు చిన్నారులు వెంటిలేటర్‌పై ఉన్నారన్నారు. సహాయక చర్యల కోసం రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. లక్షణాలు ఉన్న కుటుంబసభ్యులను గుర్తించే ప్రక్రియతో పాటు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

# సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో మహా వైఫల్యం

**గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో కొండలా పేరుకుపోయిన చెత్త**

**పని చేయని సీసీఎస్ ప్రాజెక్టులు**

**కాంట్రాక్టర్ నిర్వాకమే కారణం**

**రెండు ప్లాంట్ల నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకుని రెండు నెలలైనా పని ప్రారంభించని 'రాసా' సంస్థ**

**గాజువాక ప్లాంటును**

**కొత్తకాంట్రాక్టర్‌కు అప్పగించకుండా దాగుడుమూతలు**

**ప్రస్తుతం ఓపెన్ టిప్పర్ల ద్వారా కాపులుప్పాడ తరలిస్తున్న అధికారులు**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23:** విశాఖపట్నం– చెత్తను పర్యావరణహితంగా కాపులుప్పాడలోని యార్డుకు తరలించేందుకు జోన్‌ల వారీగా ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) పేరుతో వివిధ జోన్‌లలో ఏర్పాటుచేసిన ప్లాంట్లు ప్రస్తుతం పనిచేయడం లేదు. రెండు ప్లాంట్ల నిర్వహణ దక్కించుకున్న ఓ సంస్థ పని ప్రారంభించడంలో తాత్సారం చేస్తోంది. అదే సంస్థ..మరొక ప్లాంటు నిర్వహణను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించకుండా దాగుడుమూతలాడుతోంది. దీంతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో చెత్త కొండలా పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో అధికారులే ఓపెన్ టిప్పర్లతో చెత్తను కాపులుప్పాడ తరలిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలోని నివాసాలు, వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, మార్కెట్‌ల నుంచి వచ్చే చెత్తను సమీపంలోని జోన్‌ల పరిధిలో ఏర్పాటుచేసిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లకు క్లాప్ వాహనాల ద్వారా చేరుస్తారు. అక్కడ చెత్తను నేలపై వేయకుండా క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ పేరుతో ఏర్పాటుచేసిన గల్లాలో అన్‌లోడ్ చేస్తారు. ప్లాంటులోని ప్రత్యేక యంత్రాలు గల్లాలో పడిన చెత్తను కేక్ మాదిరిగా కంప్రెస్ చేసి, కంటెయినర్ లాంటి హుక్‌లోడర్‌లోకి లోడ్ చేస్తాయి. అలా కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఒక్కో జోన్‌లో సీసీఎస్ ప్లాంట్‌కు వచ్చే చెత్త పరిమాణం ఆధారంగా హుక్‌లోడర్లు (కంటెయినర్‌లాంటి లారీలు)ను జీవీఎంసీయే కొనుగోలు చేసి, వాటి నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంది. జీవీఎంసీ పరిధిలో ముడసర్లోవ, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక, చీమలాపల్లిలో సీసీఎస్ ప్రాజెక్టులను ఏర్పాటుచేసి కాంట్రార్లకు అప్పగించింది. గాజువాక, టౌన్‌కొత్తరోడ్డు, చీమలాపల్లి సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను 'రాసా' సంస్థ చాలాకాలంగా చేపట్టగా, ముడసర్లోవలోని సీసీఎస్ ప్రాజెక్టును మంజునాథ సంస్థ ఇప్పటికీ నిర్వహిస్తోంది. అయితే జీవీఎంసీ ఒక్కో ప్లాంటు నిర్వహణకు ఏడాదికి సగటున రూ.2 కోట్లు వరకూ వెచ్చిస్తున్నాసరే, కాంట్రాక్టర్లు చెత్తను పూర్తిగా తరలించడం లేదనే ఫిర్యాదులు కొన్నాళ్ల కిందట వెల్లువెత్తాయి. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ స్పందించి ప్రాజెక్టులను స్వయంగా తనిఖీ చేయగా, టౌన్ కొత్తరోడ్డు, గాజువాక ప్లాంట్ల వద్ద అవకతవకలు బయటపడ్డాయి. జీవీఎంసీ సమకూర్చిన హుక్ లోడర్లను సైతం మూలనపెట్టేసి, నిబంధనలకు విరుద్ధంగా, పర్యావరణానికి హాని కలించేలా ఓపెన్ టిప్పర్లతో చెత్తను కాపులుప్పాడ తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రూ.81 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఆ మొత్తాన్ని మెకానికల్ విభాగం అధికారులు కాంట్రాక్టర్ నుంచి ఎన్నో ప్రయత్నాల తర్వాత రాబట్టారు.

ప్లాంట్లను మూసేసిన కాంట్రాక్టర్

జీవీఎంసీ పరిధిలోని గాజువాక, చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు, ముడసర్లోవలోని సీసీఎస్ ప్రాజెక్టులను ఎనిమిది నెలలపాటు నిర్వహణకు రెండు నెలల కిందట జీవీఎంసీ అధికారులు టెండర్లు పిలిచారు. చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు ప్రాజెక్టులను గతంలో ఆ ప్రాజెక్టులను నిర్వహించిన 'రాసా' సంస్థ తిరిగి దక్కించుకోగా, గాజువాక, ముడసర్లోవ ప్రాజెక్టులను మంజునాథ సంస్థ దక్కించుకుంది. టెండరు నిబంధనల ప్రకారం గాజువాక ప్రాజెక్టును రాసా సంస్థ కొత్తగా టెండరు దక్కించుకున్న మంజునాథ సంస్థకు అధికారికంగా ఆడిట్‌చేసి అప్పగించాలి. అయితే ఇంతవరకూ గాజువాక ప్లాంట్‌ను కొత్తకాంట్రాక్టర్‌కు అప్పగించలేదు. దీంతో ఆ ప్లాంటులో సీసీఎస్ ప్రాజెక్టును వినియోగించలేని పరిస్థితి ఏర్పడింది. గాజువాక జోన్ పరిధిలోని చెత్తను కొద్దికొద్దిగా ఓపెన్ టిప్పర్ల ద్వారా కాపులుప్పాడ యార్డుకు తరలిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి సమస్య తలెత్తుతోంది. మరోవైపు యార్డులో చెత్త పూర్తిగా తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక చీమలాపల్లి, టౌన్‌కొత్తరోడ్డు ప్రాజెక్టులను 'రాసా' సంస్థ తిరిగి దక్కించుకున్నందున ఆ ప్లాంట్‌లను ఎలాంటి ఆడిట్ అవసరం లేకుండానే యథావిధిగా పనిచేయించేందుకు అవకాశం ఉంది. కానీ ఇంతవరకూ ఆచూకీ లేదు, దీంతో ఆ రెండు ప్లాంట్లలో చెత్తను కూడా అధికారులే ఓపెన్ టిప్పర్లను సమకూర్చుకుని కాపులుప్పాడ తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాసాపై అమితమైన ప్రేమ

రెండు ప్లాంట్లను నిర్వహించకుండా ముఖం చాటేయడంతోపాటు, గాజువాక ప్లాంటును కొత్తకాంట్రాక్టర్‌కు అప్పగించకుండా దాగుడుమూతలు ఆడుతున్న 'రాసా'పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకనో వెనుకాడుతున్నారు. కాంట్రాక్టర్ ఎవరైనా టెండరు దక్కించుకుని పని ప్రారంభించకపోతే నిబంధనల ప్రకారం రద్దు చేసి ఎల్2గా నిలిచిన వారికి అప్పగించేందుకు అ?ధికారులకు అధికారం ఉంటుంది. కానీ టౌన్‌కొత్తరోడ్డు, చీమలాపల్లి ప్రాజెక్టుల విషయంలో అధికారులు ఎందుచేతనో అలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కాంట్రాక్టు సంస్థకు ఇప్పటికే అధికారులు మూడు నోటీసులు జారీచేసినా అటువైపు నుంచి కనీసం స్పందన లేదు. జీవీఎంసీలోని కొందరు ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయిలో మునిసిపల్ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారి ఒకరు సంబంధిత కాంట్రాక్టర్‌కు అండగా ఉ ఒడడం వల్లే అధికారులు జారీచేసిన నోటీసులకు స్పందించడం లేదనే అభిప్రాయం జీవీఎంసీ అధికారుల్లో వ్యక్తమవుతోంది.

# ఆలస్యమైనా.. అన్నీ రావాలి

**వచ్చే నెలాఖరు నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలి**

**రైతు కమిటీ ప్రతినిధుల డిమాండ్**

**ఈసీజన్ వేలం ప్రక్రియపై అధికారుల అభిప్రాయ సేకరణ**

**కర్ణాటకలో కుదుటపడని మార్కెట్**

**ఆ ప్రభావంతోనే ఇక్కడ వేలం జాప్యం**



ఒంగోలు, ఫిబ్రవరి 23 పొగాకు వేలం ప్రారంభం కొంత ఆలస్యమైనా తొలి నుంచి అన్ని కంపెనీల బయ్యర్లు పాల్గొనాలని, పరిస్థితులకు అనుగుణంగా ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని అత్యధిక శాతం మంది పొగాకు రైతులు అభిప్రాయప డుతున్నారు. అదే విషయాన్ని బోర్డు అధికా రులు రైతు కమిటీలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో స్పష్టంగా చెప్తున్నారు. మూడురోజుల క్రితం ఈ అంశంపై దక్షిణాది రీజియన్‌లోని వేలంకేంద్రాల ప్రతినిధులతో పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణగోపాల్, ఆర్ఎం శీలం రామారావు నిర్వహించిన సమావేశంలో తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమైన వేలం కేంద్రాల వారీ సమావేశాల్లోనూ రైతులంతా ఆ విషయాన్ని స్పష్టంగా చెప్తున్నారు. గతేడాది మార్చి 10న దక్షిణాది వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. సిగరెట్లపై కేంద్రం పన్నులు భారీగా పెంచిన నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న కర్ణాటక మార్కెట్‌లో ధరలు తగ్గడంతోపాటు కొనుగోళు మందగించాయి. వారం పదిరోజులుగా అక్కడ మార్కెట్ గందరగోళంలో పడింది. ఆ ప్రభావంతో ఇక్కడ వేలం ప్రారంభం జాప్యమయ్యే పరిస్థితి నెలకొంది.

ఎట్టకేలకు కదిలిన అధికారులు

కర్ణాట పరిణామాలపై ఇక్కడి రైతుల్లో ఆందోళన నెలకొనడంతోపాటు జోరుగా అనధికారిక కొనుగోళ్లు సాగుతుండటం, బోర్డు వైపు నుంచి చర్యలు లేని వ్యవహారంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో బోర్డు అధికారులు కదిలారు. రైతులతో ప్రస్తుతం సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల క్రితం రీజియన్ స్థాయి ఈ సమావేశం జరగ్గా సోమవారం నుంచి గురువారం వరకు దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఒంగోలు-2 వేలం కేంద్రంలో రైతు కమిటీతో వేలం కేంద్ర అధికారి జె.తులసి భేటీ అయ్యారు. కొనుగోళ్లపై వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. కొందరు గతేడాది వలే మార్చి 10 నుంచి ప్రారంభించాలని కోరారు. అత్యధికులు ప్రస్తుత కర్ణాటక పరిస్థితులను ప్రస్తావిస్తూ వేలం కొంత ఆలస్యంగా ప్రారంభించినా తొలి నుంచి అన్ని కంపెనీల బయ్యర్లు పాల్గొనేలా అలాగే చురుకుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. అందుకోసం అవసరమైతే గతేడాది కన్నా పక్షం ఆలస్యంగా మార్చి 25 నుంచి వేలం ప్రారంభించినా అభ్యంతరం లేదని అభిప్రాయపడినట్లు తెలిసింది. ఇతర వేలం కేంద్రాల్లోనూ ఇలాంటి అభిప్రాయాన్ని అత్యధిక శాతం మంది రైతులు బోర్డు అధికారులకు స్పష్టం చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

కుదటపడని కర్ణాటక మార్కెట్

కర్ణాటక మార్కెట్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితి ఇంకా కుదటపడలేదు. సోమవారం కూడా అక్కడ కొన్ని వేలం కేంద్రాల్లో మాత్రమే వేలం కొనసాగింది. మరికొన్నింటిలో ఆగినట్లు సమాచారం. అక్కడ ఇంకా 40శాతం పంట రైతుల వద్ద నిల్వ ఉంది. అది కొనుగోలు జరగకుండా ఇక్కడ వేలం ప్రారంభించినా ప్రయోజనం ఉండదన్న భావన ఇక్కడి రైతులు వ్యక్తం చేస్తున్నారు. అందుకే గతేడాది కన్నా పక్షం రోజులు ఆలస్యంగా ప్రారంభించిన పర్వాలేదని అయితే తొలి నుంచి అన్ని కంపెనీల వారు హాజరై కొనుగోళ్లు చేసేలా చూడాలని కోరుతున్నట్లు రైతు నాయకులు చెప్తున్నారు.

# అంకితం కాదు.. ఆశయం నెరవేర్చేలా..!




**వెలిగొండపై ప్రజాప్రభుత్వం శ్రద్ధ**

**అసంపూర్తి నుంచి పరిపూర్ణత వైపు**

**నాటి తప్పిదాలను సరిచేస్తూ చకచకా పనులు**

**రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు రేపు సీఎం శంకుస్థాపన**

**ఈ ఏడాది నీరందించడమే లక్ష్యం**

**ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేసిన గత వైసీపీ ప్రభుత్వం**

**జగన్ మోసాన్ని గుర్తించిన ప్రజానీకం**

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 23:** ప్రస్తుతం పనుల్లో వేగాన్ని చూసి నమ్మకంమార్కాపురం, ఫిబ్రవరి 23ఉమ్మడి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల ప్రజలకు ఇటు సాగు, అటు తాగునీటిని అందించాలన్న సంక ల్పంతో వెలిగొండ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే అయిపోయినట్లు గత వైసీపీ ప్రభుత్వం జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేసింది. కానీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అసంపూర్తిగా ఉన్న రెండో టన్నెల్ లోపల లైనింగ్ ప్రారంభించింది. ప్రతిరోజూ దాదాపు 200 మంది కూలీలు ఈ పనులను చేస్తున్నారు. లోపల 11 కి.మీ వద్ద టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం) నిలిచిపోయి ఉంది. దాని తొలగింపు విషయం కోర్టు పరిధిలో ఉండటంతో మొదటి సొరంగం నుంచి రెండో సొరంగం లోపలికి దాదాపు 6 చోట్ల రంధ్రాలు వేసి పనులకు అవసరమైన సామగ్రిని తరలిస్తూ కష్టసాధ్యమైన పనులను పూర్తి చేసేందుకు కూలీలు శ్రమిస్తున్నారు. 18 నెలల్లోనే ఎంతో పురోగతి

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే పనుల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. టన్నెల్-2లో దాదాపు 7 కి.మీ లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉంటే అందులో 18 నెలల్లోనే 3.2 కి.మీ పూర్తి చేశారు. దాదాపు రూ.428 కోట్లను ఈ కొద్ది కాలంలో వెచ్చించారు. టన్నెల్ లోపల ప్రతిరోజూ కూలీలతో 16 మీటర్ల లైనింగ్ పనులు జరుగుతున్నాయి. మరో 360 మీటర్ల ఎర్త్ వర్క్ మిగిలి ఉంది. అది కూడా త్వరలో పూర్తికానుంది. ఇవికాకుండా పునరావాస కాలనీల్లోని 7 గ్రామాల్లో 630 కుటుంబాలకు రూ.80 కోట్ల పరిహారం కూడా మంజూరు చేశారు. ఇవి త్వరలోనే వారి ఖాతాల్లో జమ కాను న్నాయి. ఫీడర్ కాలువకు టెండర్లు ఖరా రైన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా పనులను ప్రారంభించారు. రోజుకు 1,000 క్యూబిక్ మీటర్ల చొప్పున కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. లైనింగ్ పనులకు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. ఇలా అటు టన్నె ల్, ఇటు కాలువ పనులు శరవేగంగా చేప ట్టి ఈ ఏడాది వెలిగొండ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

గతంలో తూతూమంత్రగా ఫీడర్ కాలువ పనులు

గత వైసీపీ ప్రభుత్వం ఫీడర్ కాలువ పనులను తూతూమంత్రంగా చేసి దులుపుకుంది. దాదాపు 22 కి.మీ పొడవున కాలువ తవ్వి వదిలేయడం తప్ప చేసిందేమీ లేదు. వెలిగొండ నీటిని ఈ కాలువ ద్వారా రిజర్వాయర్‌లకు చేర్చాలి. అంటే నీరు వదిలినప్పుడు ఆ ప్రవాహానికి కాలువ కట్టలు తట్టుకునేలా దృఢంగా ఉండాలి. ఈ విషయాన్ని నిపుణుల కమిటీ చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. ఫలితంగా గతంలో వర్షాలు, తుఫాన్‌లు వచ్చినప్పుడు ఫీడర్ కాలువ పలుచోట్ల కోతకు గురై గండ్లు పడ్డాయి.

పటిష్టతకు ప్రజాప్రభుత్వం చర్యలు

ప్రజాప్రభుత్వం ఫీడర్ కాలువ లైనింగ్ పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.456 కోట్లు మంజూరు చేసింది. ఆ వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఈ పనులకు సీఎం చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే 5.6 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రోజుకు 1,500 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేస్తున్నారు. నిర్దేశించిన గడువు 6 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. రిటైనింగ్ వాల్ కోసం దాదాపు 20 అడుగుల లోతు పునాది నుంచి కాంక్రీట్ గోడను కడుతున్నారు. ఇవన్నీ చూసిన ప్రజలు పునాది స్థాయి నుంచి చేయాల్సిన కొన్ని పనులు పెండింగ్‌లో ఉండగానే గత ప్రభుత్వం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి మోసం చేసిందని గుర్తించారు. ప్రజా ప్రభుత్వం వెలిగొండను తప్పక పూర్తిచేస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు



**క్రైం కౌంటర్ న్యూస్,** పంగులూరు, ఫిబ్రవరి 23 అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని ముప్పవరం క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీఎస్ఆర్ నిధులతో సంతమాగులూరు, కొరిశపాడు, బల్లికురవ, పంగులూరు మండలాలకు చెందిన 35మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. అద్దంకి, పంగులూరు, కొరిశపాడు మండలాలకు చెందిన 91మందికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.77లక్షల 35వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రజాప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చి అండగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో సీఎస్ఆర్ నిధులతో ఇప్పటివరకు పాఠశాల విద్యార్థులకు 7,500 సైకిళ్లు, 167 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీచేసినట్టు చెప్పారు. 2,509 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేశామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో నిధుల లభ్యతకు అనుగుణంగా రోడ్లు, సామాజిక భవనాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ మస్తానరావు, డీఈ దామోదరం, సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## ఒకప్పుడు టాలీవుడ్ సెన్సేషనల్ హీరో..

ఒకప్పుడు తెలుగులో క్రేజీ హీరో. 90'ం అమ్మాయిల కలల రాకుమారుడు. అప్పట్లో వరుసగా ఒక్కో సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరో ఒకప్పుడు ఇండస్ట్రీలో తోపు హీరో. స్టార్ నటుడి వారసుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టాడు. చిన్న వయసులోనే స్టార్ డమ్ సంపాదించుకున్నారు. కెరీర్ ప్రారంభించిన తొలి నాళ్లల్లోనే ప్రేమకథ చిత్రాలు, రొమాంటిక్ సినిమాలతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నాడు. అంతేకాదు.. 17 ఏళ్ల వయసులోనే దర్శక దిగ్గజాలు మణిరత్నం, శంకర్ వంటి దర్శకుల సినిమాల్లో హీరోగా నటించారు. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సినిమాలకు దూరమైన ఆయన.. ఆ తర్వాత కొన్నాళ్లకు రీఎంట్రీ ఇచ్చారు. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన.. ఇప్పుడు సహాయ నటుడిగా దూసుకుపోతున్నారు. అయితే హీరోగా సత్తా చాటుతున్న సమయంలోనే పర్సనల్ విషయాలతో మానసిక ఒత్తిడికి గురయ్యారు. భార్యతో విడాకులు తీసుకోవడంతో మానసిక సంఘర్షణకు గురై.. చాలా రోజులపాటు ఇండస్ట్రీకి దూరంగా ఆయన.. ఇప్పుడు బిజినెస్ రంగంలో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద జ్యూయెలరీ మాల్ ఓనర్ గా ఉన్నాడు. అతడు మరెవరో కాదు.. హీరో ప్రశాంత్. జీన్స్ సినిమాతో తమిళం, తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత ఎన్నో హిట్ చిత్రాలతో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు సహయ నటుడిగా రాణిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం చెన్నైలోని పానగల్ పార్క్ లో ఆయన రియాల్ గోల్డ్ టవర్ పేరుతో ఓ విశాలమైన జ్యూయెలరీ మాల్ కట్టించారు. దాదాపు 10 అంతస్తులతో సుమారు రూ.1.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆ బిల్డింగ్ నిర్మించారు. ఇందులో దేశంలోని బ్రాండెడ్ నగలు ఉన్నాయి. అలాగే అందులో ఫుడ్ కోర్ట్స్, ఏటీఎమ్స్ సైతం ఉండడం గమనార్హం. రామ్ చరణ్ నటించిన వినయ విధేయ రామ సినిమాలో హీరో సోదరుడిగా కనిపించారు. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నాడు.





## బాడీని సర్ఫ్ వేసి కడిగినట్లే.

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డిటాక్స్ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో దాల్చినచెక్క, తేనె డిటాక్స్ డ్రింక్ ఒకటి.. దీనిని దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయం రసంతో సులభంగా తయారుచేసుకోవచ్చు. ఈ ఆరోగ్యకరమైన పానీయం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దాల్చినచెక్క–తేనె డిటాక్స్ డ్రింక్.. యాంటీఆక్సిడెంట్లు (పాలిఫెనాల్స్), సిన్నమాల్డిహైడ్ (దాల్చినచెక్కలో), ఫినోలిక్ సమ్మేళనాల (తేనెలో) గొప్ప మూలం.. ఇది జీవక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం, వాపును తగ్గించడం, బరువు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. దాల్చిన చెక్క తేనె డిటాక్స్ డ్రింక్‌కు కావలసిన పదార్థాలు:

దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ, నీరు..

తయారీ విధానం:

సిన్నమన్ హనీ డిటాక్స్ తయారుచేయడం చాలా సులభం. ముందుగా, ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని పొయ్యి మీద పెట్టి బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, దానికి తగినంత దాల్చిన చెక్క పొడిని కలపాలి. నీటి పరిమాణం, దాల్చిన చెక్క ఘాటును బట్టి పొడిని సర్దుబాటు చేసుకోవాలి. దాల్చిన చెక్క పొడి వేసిన తర్వాత మరికొద్దిసేపు మరిగించాలి. అప్పుడే దాల్చిన చెక్కలోని పోషకాలు నీటిలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని ఒక గ్లాసులోకి వడకట్టుకోవాలి. చివరగా, దానికి కొద్దిగా నిమ్మకాయ రసం, ఒక స్పూన్ తేనెను కలిపి బాగా కలుపుకుంటే వేడివేడి సిన్నమన్ హనీ డిటాక్స్ సిద్ధం అవుతుంది. నిమ్మకాయ, తేనె దాల్చిన చెక్క ఘాటైన రుచిని సమతుల్యం చేస్తాయి.

ఎన్నో పోషకాలు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు:

దాల్చిన చెక్క, తేనె, నిమ్మకాయల కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ డిటాక్స్ పానీయం శరీరంలోని టాక్సిన్స్‌ను సమర్థవంతంగా తొలగిస్తుంది.. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది.. శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

ఎప్పుడు తీసుకోవాలి?

ఈ డిటాక్స్ పానీయాన్ని ఉదయం పూట తీసుకోవడం ఉత్తమం. చాలా మంది ఉదయం టీ లేదా గ్రీన్ టీ తీసుకుంటారు. దాని స్థానంలో ఈ సిన్నమన్ హనీ డిటాక్స్ ను తీసుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో ఉన్నప్పుడు, రోజులో అనేక రకాల డిటాక్స్ టీలను ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది.. అందులో ఇది ఒక రకం. డిటాక్స్ సమయంలో పాలు కలిపిన టీలను నివారించాలి. కాబట్టి పాల బదులు నీటితో తయారుచేసిన ఈ డిటాక్స్ పానీయం అనుకూలంగా ఉంటుంది.

గమనిక: దాల్చిన చెక్క కొద్దిగా ఘాటుగా ఉంటుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్సర్ తీవ్రతను బట్టి, వారు దీనిని తక్కువ మోతాదులో లేదా అప్పుడప్పుడు (రెండు, మూడు రోజులకు ఒకసారి) తీసుకోవాలి. అల్సర్స్ తీవ్రంగా ఉన్నవారు ఈ పానీయాన్ని పూర్తిగా నివారించడం మంచిది. ఏదేమైనా.. ఏదైనా కొత్త ఆహార పదార్థాన్ని డైట్‌లో చేర్చుకునే ముందు వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది..



## ఈ కాంబినేషన్ డేంజర్ గురూ..

చికెన్.. అంటే చాలు నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి లాగించేస్తారు. చికెన్‌ను కూరగా.. ఫ్రైగా.. ఇంకా మరెన్నో రకాలుగా వండుకుని ఇష్టంగా తింటారు.. ఆదివారం చాలా మంది నాన్ వెజ్ తినే వారుంటారు.. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో వారానికి ఒకటి రెండు సార్లు కాకుండా నిత్యం చికెన్ తినడం అలవాటు చేసుకుంటున్నారు. అయితే.. ప్రోటీన్ పుష్కలంగా ఉండే చికెన్.. తినడం మంచిదే.. కానీ, చికెన్ తిన్న తర్వాత కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణక్రియ సులభంగా జరగడానికి కొన్ని సూచనలను పాటించడం మంచిదని పేర్కొంటున్నారు.. చికెన్ తిన్న తర్వాత ఎలాంటి పదార్థాలు తినకూడదో తెలుసుకోండి.

చికెన్ తో పాటు పాలు, పాల ఉత్పత్తులను తీసుకోకూడదు. చికెన్ లో ప్రోటీన్ అధికంగా ఉండగా, పాలలో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఈ రెండింటి కలయిక జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని కలిగిస్తుందని, గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలకు దారితీస్తుందని ఇండియన్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ 2022 నివేదిక పేర్కొంది.

అలాగే, చికెన్ తిన్న వెంటనే స్వీట్లు, చక్కెర పదార్థాలు లేదా జ్యూసులు వంటి వాటికి దూరంగా ఉండాలి. అధిక చక్కెర పదార్థాలు రక్తంలో గ్లూకోస్ స్థాయిలను అస్థిరం చేసి త్వరగా అలసటకు కారణమవుతాయి. నిమ్మకాయ, నారింజ వంటి ఆమ్ల వంటి వాటిని కూడా చికెన్ తో కలిపి తినడం మంచిది కాదు. ఇవి పొట్టలోని ద్రవాలతో కలిసి ఎసిడిటీని పెంచుతాయి.

## భారత్ ఓపెనింగ్ దరిద్రం.

సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఎదురైన ఘోర పరాజయం టీమిండియా పరువును బజారున పడేసింది. ఈ ఓటమి తర్వాత సోషల్ మీడియాలో నెటిజన్లు భారత జట్టును ఒక ఆట ఆడుకుంటున్నారు. సెమీఫైనల్ వెళ్లడం ఇప్పుడు భారత్‌కు ఒక హిమాలయ పర్వతాన్ని ఎక్కినంత కష్టంగా మారింది. మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవడంతో పాటు, పాతాళానికి పడిపోయిన రన్ రేట్‌ను కూడా సరిచేసుకోవాలి. అయితే ఈ దారుణ పరిస్థితులకు ప్రధాన కారణం మన ఓపెనర్లు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జోడీ ఈ వరల్డ్ కప్‌లో భారత్‌కు అతిపెద్ద భారంగా మారింది.ఈ టీ20 వరల్డ్ కప్ 2026లో పాల్గొన్న మొత్తం 20 జట్లలో టీమిండియా ఓపెనింగ్ జోడీనే అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. ఓపెనింగ్ భాగస్వామ్యంలో భారత్ సగటు కేవలం 6.8 పరుగులు మాత్రమే. మనకంటే చిన్న జట్లైన ఒమన్ (సగటు 10 పరుగులు), ఐర్లాండ్, యూఏఈ, అమెరికా జట్ల ఓపెనర్లు కూడా మనకంటే మెరుగ్గా రాణించడం సిగ్గుచేటు. ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు, అత్యుత్తమ బ్యాటర్లు ఉన్న జట్టుకు ఇలాంటి రికార్డు రావడం నిజంగానే అభిమానుల గుండెను రగిలిస్తోంది.మరోవైపు న్యూజిలాండ్ ఓపెనింగ్ జోడీ ఈ టోర్నీలో సూపర్ హిట్?గా నిలిచింది. వారి ఓపెనర్లు సగటున 84 పరుగులు జోడిస్తూ అగ్రస్థానంలో ఉన్నారు. చివరికి మన తర్వాతి ప్రత్యర్థి జింబాబ్వే ఓపెనర్లు కూడా సగటున 53.33 పరుగులు సాధించి భారత్‌కు హెచ్చరికలు పంపిస్తున్నారు. ఇషాన్ కిషన్ ఒక్క మ్యాచ్‌లో కూడా శుభారంభం ఇవ్వలేకపోగా, అభిషేక్ శర్మ ఫామ్ లేమితో కొట్టుమిట్టాడుతున్నాడు. బంతిని బాదడమే లక్ష్యంగా క్రీజులోకి వస్తున్న ఈ ఇద్దరు, కనీసం పవర్ ప్లే కూడా పూర్తి చేయకుండానే పెవిలియన్ చేరుతున్నారు.ఈ నేపథ్యంలో టీమిండియా ఓపెనింగ్ జోడీని మార్చాల్సిన సమయం ఆసన్నమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫామ్ లేని అభిషేక్ శర్మను పక్కన పెట్టి, సంజూ శామ్సన్‌ను ఓపెనర్‌గా పంపాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. జట్టు అసిస్టెంట్ కోచ్ కూడా రాబోయే మ్యాచ్‌లకు ముందు సంజూ పేరును పరిశీలిస్తామని హింట్ ఇచ్చారు. మరి జింబాబ్వే, వెస్టిండీస్ వంటి కీలక మ్యాచ్‌లలోనైనా ఓపెనర్లు కళ్ళు తెరుస్తారా? లేక పాత పద్ధతిలోనే చేతులెత్తేస్తారా? అనేది తేలాల్సి ఉంది.



## భారత్ సెమీస్ చేరాలంటే..

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 సూపర్ 8 పోరులో టీమిండియా దారుణ ఓటమిని మూటగట్టుకుంది. పోటాపోటీగా సాగుతుందనుకున్న మ్యాచ్‌లో సౌతాఫ్రికా చేతిలో భారత్ ఘోర ఓటమిపాలయింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 187 పరుగులు చేస్తే.. 111 పరుగులకే ఆలౌటైన భారత్.. 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. దాంతో ఇప్పుడు భారత్ సెమీస్ చేరుకోవడానికి సౌతాఫ్రికా మీదే ఆధారపడాల్సి రానుంది.

ఈ మ్యాచ్‌లో భారత్ ఆలౌట్ కాకుండా ఉన్నా, లేకపోతే తక్కువ మార్జిన్‌తో ఓడిపోయినా ఇంత టెన్షన్ ఉండేది కాదు. 76 పరుగుల తేడాతో ఓడిపోవడం, ఆలౌట్ కావడం, 20 ఓవర్లు ఆడకపోవడంతో భారత్ నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. సూపర్ 8లో భారత్ రన్‌రేట్‌ను ఒకసారి పరిశీలిస్తే – 3.80కి పడిపోయింది.

సౌతాఫ్రికా భారీ విజయం సాధించడంతో రెండు పాయింట్లతో 3.8 నెట్‌రన్‌రేట్ సొంతం చేసుకుంది. ఈ విజయంతో సౌతాఫ్రికా సెమీస్‌కి దాదాపు లైన్ క్లియర్ అయిందనే చెప్పొచ్చు. జింబాబ్వే, వెస్టిండీస్‌లతో ఒక్క మ్యాచ్ గెలిచినా సౌతాఫ్రికా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవచ్చు. అయితే భారత్ కూడా సెమీఫైనల్‌కి వెళ్లాలంటే సౌతాఫ్రికా కచ్చితంగా జింబాబ్వే, వెస్టిండీస్‌పై గెలవాలి. అప్పుడు సౌతాఫ్రికా 6 పాయింట్లు సాధించగలదు. అదే సమయంలో భారత్ మిగతా రెండు మ్యాచ్‌లలో గెలిస్తే 4 పాయింట్లు సాధిస్తుంది. అప్పుడు సౌతాఫ్రికాతోపాటు ఇండియా కూడా సెమీస్‌లో అడుగుపెడుతుంది. సూర్య సేనసౌతాఫ్రికాతో మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను సరిగా విశ్లేషించుకోవాలి.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com